నేటి కందం- నేటికి అందం

ఖలులు రజాకార్లు ప్రజకు
కలిగించగ కష్టములను-కాపురుష తతిన్
తొలగించి,శాంతి గూర్పగ
నెలకొనె పోలీసుచర్య నేటి దినమునన్

(13-9-1948 హైదరాబాద్ విలీనానికి పోలీసుచర్య ప్రారంభం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

సమస్యల చక్రవ్యూహం
సమాజంలో మన చుట్టు
ప్రభుత్వం ఎవరిదైనా
పన్నుతుంది తెలువనట్టు
కాచకోను అర్జునుడికై
కాదు ఇది కురుక్షేత్రం
చైతన్యపు జనశ్రేణులే
ఛేదించే జనక్షేత్రం



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:36 పేజీలు:6 వెల: రూ.1/-


# సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 : సీపీఎం అగ్రనేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కన్నుమూశారు. ఆగస్టు 19న ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. తొలుత ఆయన ఆరోగ్య పరిస్థితి కుదుట పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ.. పరిస్థితి సీరియస్ గా మారడంతో వెంటిలేటర్ పై చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో గురువారం సాయంత్రం ఆయన తుది శ్వాస విడిచారు.

ప్రస్థానం ..

సీతారాం ఏచూరి 1952, ఆగస్టు 12న చెన్నైలోని ఓ తెలుగు కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రి ఏచూరి సర్వేశ్వర సోమయాజి, తల్లి ఏచూరి కల్పకం. సీతారం విద్యాభ్యాసం అంతా కూడా ఢిల్లీలోనే సాగింది. సీబీఎస్ఈ పరీక్షలో ఆయన జాతీయ స్థాయిలో మొదటిర్యాంకు సాధించారు. ఆ తర్వాత సెయింట్ స్టీఫెన్ కళాశాల నుంచి ఆర్థికశాస్త్రంలో బీఏ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి ఎంఏ ఆర్థిక శాస్త్రంలో పట్టా పొందారు. 1974లో సీతారం స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరారు. ఆ తర్వాత 1975 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)లో సభ్యుడు అయ్యారు. ఆ తర్వాత పార్టీలో కీలకంగా మారారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ఆయన అరెస్టయ్యారు. ఆ సమయంలో జేఎన్‌టీయూలో పీహెచ్‌డీలో చేస్తున్న ఆయన డాక్టరేట్ పూర్తి చేయలేకపోయారు. దేశంలో అత్యవసర పరిస్థితిని ఎత్తివేసిన తర్వాత సీతారాం జేఎన్‌యూ విద్యార్థి నాయకుడిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారు.

1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటు దక్కింది. ఇక 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. పార్లమెంటు దృష్టికి ఎన్నో సమస్యలను తీసుకుచ్చి మంచి గుర్తింపును పొందారు. 2006లో బిజినెస్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమితులయ్యారు. 2011లో తిరిగి రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు. 2012లో వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా సేవలందించారు. 2015, ఏప్రిల్ 19న విశాఖపట్నంలో జరిగిన సీపీఐ(ఎం) 21వ కాంగ్రెస్‌లో పార్టీకి ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏచూరి ఎన్నికయ్యారు. అలాగే ఆ ఏడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానానికి రాజ్యసభలో ఏచూరి సవరణలు ప్రతిపాదించారు. దీనిపై జరిగిన ఓటింగ్‌లో ఆయన సవరణ ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలోనే ఇలా జరగటం నాలుగోసారి. ఇది నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించింది. భారత్‌లో గణతంత్ర వేడుకల సందర్భంగా బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా రావడాన్ని వ్యతిరేకించారు. ఇస్లాం ఛాందసవాదం పెరగడానికి అమెరికానే కారణమని ఏచూరి విమర్శించేవారు. ప్రపంచంపై అమెరికా పెత్తనపు ధోరణికి పాల్పడుతోందని ఆరోపిస్తుండేవారు. అలాగే మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాలను కూడా ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారు. బీజేపీ దేశంలో మత విద్వేషాన్ని పెంచుతోందని విమర్శలు చేసేవారు. అలాగే జమ్మూ, కాశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ం రద్దును కూడా ఆయన వ్యతిరేకించారు. కాగా, సీతారం మొదటి భార్య ఇంద్రాని మజుంబార్. ఆ తర్వాత బీబీసీ హిందీకి ఢిల్లీ ఎడిటర్ అయిన సీమా చిస్తీని రెండో వివాహం చేసుకున్నారు. ఆమె ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కూడా రెసిడెంట్ ఎడిటర్‌గా పనిచేశారు.

# సీతారాం పోరాటం స్ఫూర్తి దాయకం.. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 :ప్రముఖ రాజకీయవేత్త, వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరనిలోటని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏచూరి దాదాపు నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి అన్నారు. రాజ్యసభ ఎంపీగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్త గా, సామాజిక కార్యకర్తగా ఆయన దేశంలో అందరికీ సుపరిచితుడయ్యారని.. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు.

# కేంద్ర పన్నులో రాష్ట్రం వాటా పెంచండి

## -మరోసారి గళం విప్పిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి
## -కేరళలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 :రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే పన్ను వాటాను పెంచాల్సిందేనని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి తన గళాన్ని వినిపించారు.. తిరువనంతపురం లో ఇవాళ జరిగిన 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర ఆర్థిక మంత్రుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రాలకు న్యాయమైన వాటాలో నిధులు అందడం లేదని దీర్ఘకాలంగా వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలతో పాటు పంజాబ్ అభిప్రాయాలను కూడా తెలుసుకునేందుకు కేరళ రాజధాని తిరువనంతపురం లో ఈ కాంక్లేవ్ నిర్వహించారు.

కేరళ సీఎం అధ్యక్షతన తమిళనాడు, కర్ణాటక, కేరళ, పంజాబ్, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. రాష్ట్రాలు వసూలు చేసి కేంద్రానికి అందిస్తున్న పన్నుల ఆదాయంలో తిరిగి రాష్ట్రాలకు 41 శాతం మాత్రమే అందుతుందని, దీన్ని కనీసంగా 50 శాతానికి పెంచాలని పలు రాష్ట్రాలు 16వ ఫైనాన్స్ కమిషన్‌కు నివేదించాయి. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను 16వ ఫైనాన్స్ కమిషన్ సేకరిస్తున్నందున న్యాయమైన వాటాకోసం ఒత్తిడి



పెంచేలా పలు రాష్ట్రాలు ఈ కాంక్లేవ్‌లో పాల్గొన్నాయి. దీనిలో పాల్గొన్న భట్టి కేంద్రం ఇప్పుడు ఇస్తున్న 41 శాతం వాటాను 50శాతానికి పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు.. రాష్ట్రాల నుంచి ఎక్కువ ఆదాయం పొందుతూ, అదే రాష్ట్రాలకు కేంద్రం అతి తక్కువ నిధులు ఇస్తుందని భట్టి అన్నారు.

# సీతారాం మరణం కార్మిక లోకానికి తీరని లోటు.. కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపాన్ని ప్రకటించారు. సామ్యవాద భావాలు కలిగిన ఏచూరి, విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా అంచలంచలుగా ఎదిగి ప్రజాపక్షం వహించారని.. వారి సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు.

సీతారాం ఏచూరి మరణం భారత కార్మిక లోకానికి, లౌకిక వాదానికి తీరని లోటని కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఏచూరి మరణంతో శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సిజెఐ ఇంట్లో వినాయక పూజలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ

## - సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ



న్యూఢిల్లీ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నివాసంలో జరిగిన వినాయక పూజలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. సిజెఐ ఇంటికి వెళ్లిన ప్రధాని మోడీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయమూర్తులు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టేనని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ప్రశాంత్ తన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ప్రైవేట్ మీట్ కోసం సిజెఐ చంద్రచూడ్ తన నివాసానికి మోడీని అనుమతించడం మంచిది కాదు అని, ఇలాంటి సమయంలో న్యాయవ్యవస్థపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని భూషణ్ పేర్కొన్నారు. సిజెఐ ఇంట్లో జరిగిన గణపతి పూజలో ప్రధాని మోడీ పాల్గొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిజెఐ ఇంటికి ప్రధాని వెళ్లడం ఎంత వరకు సరైందని నెటిజన్లు నిలదీస్తుండగా మరికొందరు సమర్థిస్తున్నారు. సిజెఐ ఇంట్లో ప్రధాని పూజలో పాల్గొనడం తప్పుడు సంకేతాలు ఎలా అవుతాయని మరికొందరు కామెంట్లు చేస్తున్నా

# సెప్టెంబర్ 17ని తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

## -6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం బేషరుతుగా అమలు చేయాలి.
## - అర్హులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలి.
## - బీజేఎల్పీ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం



హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అసెంబ్లీ, బీజేపీఎల్పీ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది .ఈ సమావేశానికి బిజెపి ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, ఈటెల రాజేందర్, అరవింద్, డీకే అరుణ, గోడెం నగేష్, విశ్వేశ్వర్ రెడ్డి లతో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ,పాయల శంకర్,వెంకట రమణ రెడ్డి,పైడి రాకేష్ రెడ్డి,పాల్వాయి హరీష్ బాబు,రామారావు పాటిల్,దన్పాల్ సూర్యనారాయణ,ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఈ సమావేశం లో ఎజెండాలోని పది అంశాలతో పాటు.. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఈ క్రింది డిమాండ్స్ చేస్తూ సమావేశం తీర్మానించింది. - సెప్టెంబర్ 17ని తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి. - ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం బేషరుతుగా అమలు చేయాలి. - అర్హులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలి. - పార్టీ ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్ లో దీక్ష. - అర్హులందరికీ రేషన్ కార్డ్స్ పంపిణీ చేయాలి. - వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వే చేయించి బాధిత రైతులకు ఆర్థిక సహాయం అందించాలి. - 'హైడ్రా' నిష్పక్షపక్షపాతంగా వ్యవహరించాలి. - పార్టీ మారిన ఎమ్మెల్యే లపై హైకోర్టు ఆదేశాలను స్పీకర్ గారు తప్పకుండా అమలు చేయాలి. అలాగే పలు నిర్ణయాలను తీసుకున్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ,- ఎండోమెంట్ భూములను రక్షణకై పోరాటం. - బీజేపీ సభ్యత్వ నమోదు డ్రైవ్ ను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# సీతారాం ఆలోచనలే ప్రత్యేకం.. చంద్రబాబు


అమరావతి, సెప్టెంబర్ 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏచూరి భారతదేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తుల్లో ఒకరని తెలిపారు. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఏచూరి ఎదిగారని గుర్తుచేసుకున్నారు.

ఆయన ఆలోచనలు సీపీఎం పార్టీకి ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టాయన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులు, సహచరులు, అనుచరులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కాగా, ఏచూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాడ, సానుభూతి తెలిపేందుకు చంద్రబాబు నేటి రాత్రికి ఢిల్లీ వెళ్లనున్నారు.

# సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి....

## -జిల్లా అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి.

కరీంనగర్, సెప్టెంబర్ 12 : (నేటినిజం ప్రతినిధి) గామాల్లో బీజేపీ



సభ్యత్వ నమోదు ను వేగవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి సూచించారు. సభ్యత్వ నమోదు మండల స్థాయి కార్యక్రమాన్ని గురువారం తిమ్మాపూర్ మండల కేంద్రం లో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సమ్మిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీ గ్రామం నుండి ఎంతో మంది బీజేపీని ఆదరించారని వారందరికీ సభ్యత్వం ఇచ్చేలా ప్రయత్నం చేయాలని కోరారు. గ్రామానికి ఇద్దరి చొప్పున నియామకమైన ఇంచార్జి లు బూత్ ల వారిగా సభ్యత్వం పై దృష్టి సారించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి నుండి బూత్ స్థాయి కార్యకర్తలందరూ సభ్యత్వం చేసుకోవాలని సూచించారు. 8800002024 ఫోన్ నంబర్ ద్వారా గానీ, నమో ఆప్ ద్వారా గానీ, స్కానర్ ద్వారా గానీ సభ్యత్వం తీసుకోవచ్చని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్,సభ్యత్వ నమోదు ఇంచార్జి లు కిన్నెర అనిల్, గడ్డం అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,చింతం వరలక్ష్మి, వేల్పుల రవీందర్ యాదవ్,వేల్పుల ఓదయ్య, కంది రాజేందర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి కారు, బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసు లు వెంటనే సంఘటనా స్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కంటైనర్.. టమాటా లోడుతో చెన్నైకి వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వాలి

## -అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 12 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలను గురువారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి సందర్శించి, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తాను విద్యను అభ్యసించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. తాను చదువుకున్న ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు విచ్చేసి సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న సందర్భంగా ప్రభుత్వ లెక్చరర్లు తనకు ఒక అవకాశం ఇవ్వాలని,కరీంనగర్, అదిలాబాద్,నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మద్దతివ్వాలని కోరారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన మంజూరి గురించి ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.

# ఏ.పి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటి

విజయవాడ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) ఏ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగానే కలిసారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట చంద్రబాబును కలిసిన కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ ఉన్నారు.

నాలుగోసారీ ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడిని అభినందించిన మంత్రిఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం మధ్యాహ్నం భేటి అయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆయన సతీమణి కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ చంద్రబాబు నాయుడుని కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి లో జరిగిన ఈ భేటి కేవలం మర్యాద పూర్వకంగానే కలిసినట్లు మం-త్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తాజాగా జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించి నాల్గో సారీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉత్తమ్ దంపతులు అభినందించారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి హేయనీయం

## -పట్టపగలే ఒక ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి పాల్పడటమే ఇందిరమ్మ రాజ్యమా!
## -తీవ్రంగా ఖండించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయటాన్ని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఒక ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా? అని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి పోలీసుల సాయంతో అరికెపూడి గాంధీ గుండాలు రెచ్చిపోయి దాడులకు పాల్పడటమేమిటన్నారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజం, రౌడీయిజానికి అడ్డాగా మార్చేస్తుండటం చూస్తుంటే బాధేస్తుందన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని కెటిఆర్ ఆరోపణలు చేశారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న కౌశిక్ రెడ్డిని ఈ ప్రభుత్వం టార్గెట్ చేసిందన్నారు. కావాలనే తనపై అక్రమ కేసులు, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బిఆర్ఎస్ బెదరదని కెటిఆర్ స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ భాషల్లో పట్టు సాధించలేమా !

జాతి ప్రజలను ఏకం చేసే దివ్య సాధనం భాష. భాష లేనిదే మానవ ఉనికి లేదు. దేశ ప్రగతి రథానికి కందెన భాష మాత్రమే. అమ్మ పలుకుల పలుకుబడి మాతృభాష. ప్రతి భాషకు తియ్యదనం, ప్రత్యేకత, లిపి ఉన్నాయి. భావవ్యక్తీకరణకు యానకం భాష. భాషయే జాతి గుండె సడి. నాగరికత వర్థిల్లడానికి భాషే ప్రధాన కారణం. దేశ భావవ్యక్తీకరణకు భాషే ఉపకరణం. భాష లేని సమాజం మూగబోతుంది. భారతీయ సంస్కృతికి ఆత్మలాంటిది మన జాతీయ హిందీ భాష. భారతదేశంలో అత్యధికులు మాట్లాడే ఇండో-యూరోపియన్ భాషగా హిందీకి, దేవనగరి లిపికి జాతీయ భాషగా గుర్తింపు ఉంది.

## భారత జాతీయ భాషగా వెలుగొందుతున్న హిందీ:

పార్సియన్ పదం 'ఇండస్' నుంచి హిందీ, హిందుస్థాన్ పదాలు ఉద్భవించాయి. భారత రాజ్యాంగం 22 భాషల్ని అధికార హోదా కలిగిన భాషలుగా గుర్తించింది. భిన్నత్వంలో ఏకత్వానికి నులువెత్తు సాక్షిగా పరిడవిల్లుతున్న సువిశాల భారతంలో దాదాపు 19,569 భాషలు, యాసలు ఉన్నాయని, అందులో 1,369 మాతృ భాషలకు బహుళ ప్రచారం ఉందని అంచన. 2001 గణాంకాల ప్రకారం ఒక మిలియన్ కన్న అధిక జనాభా మాట్లాడే భాషలు 30 ఉండగా, 10,000 కన్న అధిక జనాభా మాట్లాడే భాషలు 122 ఉన్నాయని గుర్తించారు. భారతావనిలోని 11 రాష్ట్రాల అధికార భాషగా హిందీ మాట్లాడుట జరుగుతున్నది. భారత దేశ జనాభాలో హిందీ భాష మాట్లాడే జనులు 57.09 శాతం, ఆంగ్ల జనాభా 10.67 శాతం, బెంగాలీ జనాభా 8.85 శాతం, మరాఠీ జనాభా 8.18 శాతం, తెలుగు జనాభా 7.77 శాతం ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 4వ అత్యధికులు మాట్లాడే భాషగా (చైనీస్, స్పానిష్, ఇంగ్లీష్ తరువాత) హిందీకి గుర్తింపు ఉంది. హిందీ భాషలోని కర్మ, లూట్, పైజామా, అవతార్, ఆలు లాంటి పలు పదాలు ఆంగ్ల డిక్షనరీలో కూడా చోటు దక్కించుకున్నాయి.

## జాతీయ హిందీ దినోత్సవం-2024:

భారత జాతీయ భాష హిందీ మాట్లాడే ప్రజలు పలు దేశాల్లో విస్తరించి ఉన్నారు. ఇండియాతో పాటు ట్రినిడాడ్-టొబాకో, నేపాల్, గుయానా, మారిషస్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, యూఏఈ, యూకె, యుయస్, జర్మనీ, న్యూజిలాండ్, ఉగాండా, దక్షిణాఫ్రికా లాంటి పలు దేశాల్లో హిందీ జనాభా మాట్లాడే జనం అధికంగా కనిపిస్తారు. 14 సెప్టెంబర్ 1949న భారత రాజ్యాంగ సభ హిందీ భాషను అధికారిక భాషగా ఆమోదించడంతో ప్రతి ఏట 14 సెప్టెంబర్‌న భారత దేశవ్యాప్తంగా "జాతీయ హిందీ దినోత్సవం (రాష్ట్రీయ హిందీ దివస్)" పాటించడం 1953 నుంచి ఆనవాయితీగా మారింది. 14 సెప్టెంబర్ 2024న దేశవ్యాప్తంగా 75వ "రాష్ట్రీయ హిందీ దినస్" జరుగుపుకోవడం కొనసాగుతున్నది. హిందీ భాష మాట్లాడే మానవాళిని ఒకే వేదిక మీదకు చేర్చడానికి ప్రతి ఏట ఈ వేడుకలు ఘనంగా పాటిస్తున్నారు. హిందీ భాష సౌందర్యాన్ని, సొగసులు, తీయ్యదనాన్ని, మాధుర్యాన్ని ఆస్వాదించడానికి వేదికగా జాతీయ హిందీ దినం పాటిస్తారు. ఐరాసలో 10 జనవరి 1949 రోజున తెలి సారి హిందీ భాషలో మాట్లాడడానికి గుర్తుగా విశ్వవ్యాప్తంగా ప్రతి ఏట 10 జనవరి రోజున "ప్రపంచ హిందీ దినం" కూడా జరుపుకోవడం కొనసాగుతున్నదని గమనించాలి.

## ఉత్తర భారతీయుల మాతృభాష:

ఉత్తర భారతంలోని 9 రాష్ట్రాలు, 03 కేంద్రపాలిత ప్రాంతాల ప్రజలు అధికంగా మాట్లాడే హిందీ భాషను 03 రాష్ట్రాలు అధికార భాషగా గుర్తించాయి. జాతిని ఏకం చేయగల సామర్థ్యం కలిగిన హిందీ భాషను నేర్చుకోవలసిన కనీస బాధ్యత ప్రతి భారతీయుడికి ఉన్నది. మాతృభాషను కాపాడుకుంటూ, జాతీయ భాషకు పట్టం కడుతూ, అంతర్జాతీయ ఆంగ్లాన్ని ఆదరిస్తూన్న యువతకే బంగారు భవిష్యత్తు ఉంటుంది. ప్రాంతీయ మాతృభాష పట్ల ప్రేమ ఉండాలే కాని దురభిమానం వద్దు. జాతీయ హిందీ భాష పట్ల ద్వేషం నేర సమానం. హిందీని ద్వేషిస్తూ మన కళ్లను మన చేతులతోనే పొడుచు కోవద్దు. భారతంలో గంగా నది ప్రవహించినంత కాలం, హిందీ భాష మన పెదాల వెంట ప్రవహించాల్సిందే.

తెలుగు భాషను చిన్న చూపు చూసే ప్రబుద్దులు ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు పరాయి ఆంగ్ల భాష వ్యామోహులు అవుతున్నారు. ప్రాంతీయ తెలుగు భాషతో పాటు జాతీయ హిందీ భాష, అంతర్జాతీయ ఆంగ్ల భాషలను తప్పక మాట్లడగలిగే స్థాయిలో పౌరులు, ముఖ్యంగా నేటి డిజిటల్ యువత సిద్ధంగా ఉండాలి. హిందుస్థాన్ అంటే హిందీ అని, హిందీ అంటే జాతి గుండె అని నమ్ముదాం, హిందీ భాషను భారత నలుదిశల ఊరేగిద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో అటవీ సిబ్బంది సేవలు అమూల్యం

## – డిఎఫ్ఓ సిహెచ్ బాలమణి




హైదరాబాద్, సెప్టెంబర్ 12 :భూమాతపై నెలకొన్న సహజ ప్రకృతి వనరులను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా అటవీ సిబ్బంది రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా కాపలా కాయడం జరుగుతున్నట్లు కరీంనగర్/సిరిసిల్ల జిల్లాల డిఎఫ్ఓ సిహెచ్ బాలమణి అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఫారెస్ట ఆఫీసు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో కలప స్మగ్లర్లు, వన్యప్రాణులు, అటవీ భూమి దురాక్రమణదారుల నుండి దాడులు జరగడం, ప్రాణాలు సహితం అర్పించడం కొనసాగుతున్నట్లు ఆవేదన వ్యక్తుల చేశారు.

ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా ట్రేనీ కలెక్టర్ అజయ్ మాట్లాడుతూ నేడు అడవులను రక్షించుకుంటేనే రేపటి తరానికి, సకల జీవకోటికి ఆరోగ్యకరమైన పర్యావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఆఫ్ మంకమ్మతోట జిల్లా చైర్మన్లు లయన్ జి లక్ష్మయ్య, లయన్ పి శేఖర్‌లు మాట్లాడుతూ అమరులైన అటవీ సిబ్బంది కుటుంబాలకు బాసటగా నిలుస్తామని, వాతావరణ ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న అటవీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాణ త్యాగం చేసిన అటవీ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా సభ్యులు ఎం మహేందర్, వి నరెందర్‌లతో పాటు మంకమ్మతోట లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారిగా పాటు ఇతర లయన్ సభ్యులు, రేంజ్ ఆఫీసర్స్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తూ ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల కుటుంబ సభ్యులకు అటవీ శాఖ, లీడ్ ఇండియా, మంకమ్మతోట లయన్స్ ఘనంగా సన్మానించారు.

# తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 న హిందీ దివస్

హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );14 సెప్టెంబర్ హిందీ దివస్ సందర్భంగా, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందీ కవులు, హిందీ జర్నలిస్టులు, హిందీ సేవకులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనైనది. 14 వ తేది ఉదయం 10-30 గంటలకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఇటీవల స్వర్గస్థులైన హిందీ మిలాప్ ఎడిటర్ వినయ్ వీర్ గారి స్మారకార్థం ప్రతిసంవత్సరం ఒక సీనియర్ జర్నలిస్టును వినయవీర్ స్మారక పురస్కారం తో సత్కరించాలని నిర్ణయించాము. అలాగే అంతకు ముందు లాగే ఈ ఏడాదికి గాను స్వ. సదాశివ శర్మ గారి స్మారక పురస్కారం శృతి కాంత భారతి, హింది పుస్తకాల పబ్లిషర్, విద్యారణ్య గారి స్మారకార్థం ఇచ్చే పురస్కారం, శ్రీ రాకా సుధాకర్ , సీనియర్ పాత్రికేయుడు గార్లకు ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే హిందీ భాషా దినోత్సం గూర్చిన వ్యాస రచన పోటీలు, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించాం. విజేతలకు పురష్కారాలు. హిందీ టీచర్లకు సన్మానం. ముఖ్య అతిథులుగా శ్రీ పొంగులేటి శ్రీనివాస్ , సమాచార పౌరసంబంధాల మంత్రి, శ్రీ కే. శ్రీనివాస రెడ్డి , ప్రెస్ అకాడమి అధ్యక్షులు, ఎస్. వేణుగోపాలాచారి , మాజీ కేంద్ర మంత్రి వర్యులు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

# స్వచ్ఛతా హి సేవపై అవగాహన కల్పించాలి : కలెక్టర్లకు నీరబ్ కుమార్ ఆదేశం



తిరుపతి, సెప్టెంబర్ 12: సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు జరిగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమనీపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తిరుపతి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 14వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు 2024 లో స్వభావ్ స్వచ్ఛత ? సంస్కార్ స్వచ్ఛత అను నినాదంతో ఈ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా చెరువుల కుంటల వద్ద వ్యర్థపదార్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదరులను సమన్వయనీ చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ? జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం కింద అన్ని మున్సిపాల్టీల్లో, అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు, అన్నిచోట్ల శ్రమదానం కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, రైల్వేస్టేషన్లు, చెత్త కుప్పలు, నల్లాల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్ లు నిర్వహించాలన్నారు. ఈ మెగా శుభ్రత డ్రైవ్ లు చాలా యాక్టివ్ గా నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈలు, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడం, ఆరోగ్య సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్డీవో సుశీల దేవి, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ సిద్ధ మందుల కలయికతో కౌమారదశ అమ్మాయిల్లో రక్తహీనత తగ్గింది: అధ్యయనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :కౌమారదశలో ఉన్న బాలికలలో రక్తహీనతను ఒక రకమైన ఔషధం తగ్గిస్తున్నట్లు ఇండియన్ ట్రెడిషనల్ నాలెడ్జ్ జర్నల్ ప్రచురించిన ఒక అధ్యయనం పేర్కొంది. పబ్లిక్ హెల్త్ ఇనీషియేటివ్ (విహెచ్ఐని) నిర్వహిస్తున్న పరిశోధకులే ఈ అధ్యయనకర్తలు. రక్తహీనతకు సరైన పరిష్కారాన్ని అందించాలన్న లక్ష్యంతో 'సిద్ధ' ఔషధాలను వాడకంలోకి తెచ్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ లోని సిద్ధ జాతీయ సంస్థ (ఎన్ఐఎస్), జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్ (తమిళనాడు), వేలుమైలు సిద్ధ వైద్య కళాశాల (తమిళనాడు), దాని అనుబంధ ఆస్పత్రి- సహా దేశంలో ప్రసిద్ధ 'సిద్ధ' సంస్థలకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనంలో పాల్గొన్నది. ఎబిఎమ్ఎన్ (అన్నపేటి సెంతూరమ్, బావనా కటుక్కాయ్, మాతులైమణప్పాకు, నెల్లిక్కయ్ లేకియమ్) సిద్ధ మందుల కలయిక- రక్తహీనతకు లోనైన కౌమార దశలోని బాలికల్లో రక్తవర్ణం (ఊవఎనీణశ్రీనీఎతిని) స్థాయిని మెరుగుపరచడంతో పాటు పీసీవీ, ఎంసీవీ, ఎంసీహెచ్ (కణస్థాయి హీమోగ్లోబిన్) స్థాయులను చక్కదిద్దగలదని కనుగొన్నారు.

ఈ అధ్యయనంలో భాగంగా 2,648 మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో 45 రోజులపాటు నిర్ణీతంగా కొందరు ఉండాలి. అలా 2,300 మంది ఉన్నారు. కార్యక్రమాన్ని మొదలు పెట్టడానికి ముందు పరిశోధకులు అందరికీ నులిపురుగు చికిత్స చేశారు. ఇందుకోసం కంటైవర్రాల్ చూర్ణాన్ని ఉపయోగించారు. తర్వాత అన్నపేటి సెంతూరమ్, బావనా కటుక్కాయ్, మాటులైమణప్పాకు, నెల్లిక్కాయ్ లేకియమ్ లతో(ఎబిఎమ్ఎన్) 45 రోజుల పాటు చికిత్స అందించి వారిని పర్యవేక్షణలో ఉంచారు.

ఊపిరిఆడకపోవటం, అలసట, తలతిరగటం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, పాలిపోవడం వంటి లక్షణాలనూ, వీటితోపాటు హీమోగ్లోబిన్ స్థాయులను, ఇతర జీవ రసాయినిక స్థాయిలనూ- చికిత్సకు ముందూ, చికిత్స తర్వాతా పరిశీలించారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) మార్గదర్శకాల శరీరంలో హీమోగ్లోబిన్ కనీసం 11.9 ఎమ్‌జి/డిఎల్ (ఒక్కో డెసి లీటరుకు మిల్లీ గ్రాముల)గా ఉండాలి. ఇది 8.0 ఎమ్‌జి/డిఎల్ కన్నా పడిపోతే దానిని తీవ్రమైన రక్తహీనతగానూ, 8.0 నుండి 10.9 ఎమ్‌జి/డిఎల్ గా ఉంటే దానిని మధ్యేమార్గంగాను, 11.0 నుంచి 11.9 ఎమ్‌జి/డిఎల్ మధ్య ఉన్నప్పుడు దానిని స్వల్పంగాను లెక్కగట్టారు.

ఎంపిక చేసిన ఓ 283 మంది బాలికల్లో హీమోగ్లోబిన్, పీసీవీ, ఎంసీవీ, ఎమ్‌సిహెచ్, ఎర్ర రక్తకణాలు (ఆర్‌బిసి), ప్లేట్‌లెట్లు, తెల్ల రక్తకణాలు (డబ్ల్యుబిసి), న్యూట్రోఫిల్స్, లింఫోసైట్స్, ఈసినోఫిల్స్- ఎంత ఉన్నదీ చూడడానికి ప్రయోగశాల స్థాయి పరిశోధనను చేపట్టినట్లు అధ్యయనం తెలిపింది. ఎబిఎమ్ఎన్ ను వాడినందువల్ల అది అలసట, ఆయాసం, జుత్తు రాలడం, తలనొప్పి, ఆసక్తి లోపించడం, రుతుపరమైన అపక్రమం వంటి రక్తహీన సంబంధి రోగచికిత్స లక్షణాలను చెప్పుకోదగినంత మేరకు తగ్గించడంతో పాటు ఆ బాలికలందరిలో హీమోగ్లోబిన్ స్థాయి, పీసీవీ, ఎమ్‌సీవీ, ఎంసీహెచ్‌లు గణనీయంగా మెరుగుపడినట్లు పరిశోధకులు గుర్తించారు.

ఈ అధ్యయనం నివేదికను రూపొందించిన సీనియర్ రచయితలలో ఒకరైన సిద్ధ జాతీయ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మీనాకుమారి అధ్యయనంలో కనుగొన్న అంశాల ప్రభావాన్ని, ప్రాముఖ్యాన్ని గురించి వివరిస్తూ, "ఆయుష్ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న సార్వజనిక ఆరోగ్య కార్యక్రమాలలో సిద్ధ వైద్యం చెప్పుకోదగిన పాత్రను పోషిస్తోంది. యవ్వన (కౌమార) దశలో ఉన్న బాలికల్లో చైతన్యాన్ని తీసుకుని రావడం, పోషణ సంబంధిత సూచనలు-సలహాలు ఇవ్వడం, ముందు జాగ్రతగా అందించిన సంరక్షణ, సిద్ధ ఔషధాల ద్వారా అందించిన చికిత్స అనీమియా రోగులకు చికిత్సపరమైన ప్రయోజనాలను అందించింది. ఈ కారణంగా సిద్ధ మందులు వివిధ స్థితిగతుల్లో ఖర్చు తక్కువగా ఉండేటటువంటి, సులభ ఉపచారాన్ని అందించి సార్వజనిక ఆరోగ్య సంరక్షణలో తోడ్పడగలుగుతాయి" అని పేర్కొన్నారు.

# అమరావతిలో స్పోర్ట్స్ హబ్- ఎంపీ కేసినేని శివనాధ్




అమరావతి, సెప్టెంబర్ 12 :ఆంధ్రుల కలల రాజధాని అమరావతిలో స్పోర్ట్స్ హబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాధ్ ప్రకటించారు. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్టేడియం నిర్మాణాలను చేపట్టి అంతర్జాతీయ మ్యాచ్ లకు వేదికగా చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం కార్యాలయంలో గురువారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ బాడీ కౌన్సిల్ సమావేశాన్ని ఏసీ అధ్యక్షుడు కేశినేని శివనాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మంగళగిరి అంతర్జాతీయ స్టేడియాన్ని ఆంధ్ర క్రికెట్ అకాడమీ సభ్యులతో కలిసి పరిశీలించిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాద్ మీడియాతో మాట్లాడుతూ? ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ బాడీ కౌన్సిలింగ్ మొదటి సమావేశం జరగటం ఆనందంగా ఉందన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం పూర్తి చేసి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడేందుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రోడ్లు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైజాగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో క్రికెట్ స్టేడియంతో పాటు త్వరలోనే స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తామని, వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్టేడియం నిర్మాణాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.




# లింక్డ్ఇన్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్ 2024లో అగ్రస్థానంలో నిలిచిన ఐఐఎఫ్‌టీ.. టాప్ 100 సంస్థల్లో 51వ స్థానంలో ఐఐఎఫ్‌టీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని దేశంలోని ప్రధాన బిజినెస్ స్కూల్ అయిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) నెట్ వర్కింగ్ లో ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచంలోని టాప్ 100 ఎంబీఓ కోర్సులలో 51వ స్థానంలో నిలిచింది.

ఈ సందర్భంగా వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఐఐఎఫ్‌టీని అభినందించారు.

ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవటానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా మారేందుకు ఐఐఎఫ్‌టీలో పెరుగుతున్న చైతన్యాన్ని ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు సూచిస్తుందని అన్నారు. భవిష్యత్‌పై ఆశాభావం వ్యక్తం చేసిన వాణిజ్య శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ బర్త్వాల్.. పూర్వ విద్యార్థులు, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు, ప్రభుత్వాలతో బలమైన సంబంధాలను ఏర్పరచుకోవడంతో పాటు విద్యా, పరిశోధనలో శ్రేష్ఠతలను సాధించడానికి ఈ సంస్థ చేస్తున్న స్థిరమైన ప్రయత్నాలకు ఈ విజయం నిదర్శనమని అన్నారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాకేష్ మోహన్ జోషి మాట్లాడుతూ.. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కార్పొరేట్, ప్రభుత్వం వంటి భాగస్వాముల సహాయంతో విద్యా, పరిశోధన, శిక్షణలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

అంతర్జాతీయ స్థాయిలో కార్పొరేట్లు, విధాన నిర్ణేతలకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు అత్యాధునిక సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డిస్కషన్స్ (సీఐఎన్)ను ఐఐఎఫ్‌టీ నెలకొల్పుతోంది.

ఎగుమతిదారులు, కార్పొరేట్, ప్రభుత్వ సన్నిహిత సహకారంతో భారతీయ కంపెనీలు, విధాన నిర్ణేతలు సాధించిన విజయాలు, అనుభవాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రపంచ స్థాయి కేస్ స్టడీలను తెలియజేసేందుకు హార్వర్డ్ తరహాలో ఇంటర్నేషనల్ బిజినెస్ కేస్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేసే పనిలో ఈ సంస్థ ఉంది.

# వినియోగదారులకు మరింత మెరుగ్గా టెలికాం సేవలు: డాట్, ట్రాయ్ ఉమ్మడి చర్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :టెలికాం వినియోగదారుల వినియోగ అనుభవాన్ని మెరుగుపరచడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్), టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఉమ్మడి సహకార చర్యలు చేపట్టాయి. హై స్పీడ్ డేటాతో స్పామ్ లేని నాణ్యమైన టెలికాం సేవలను ప్రారంభించడానికి అనేక చర్యలు తీసుకున్నాయి.

స్పామ్ కాల్‌ల బెడదను అరికట్టడానికి, రోబోకాల్స్, ప్రీ-రికార్డ్ కాల్‌లతో సహా స్పామ్ కాల్‌ల కోసం బల్క్ కనెక్షన్‌లను ఉపయోగించే సంస్థలను డిస్‌కనెక్ట్ చేసి బ్లాక్‌లిస్ట్ చేయమని టెలికాం ఆపరేటర్‌లను ట్రాయ్ ఆదేశించింది. గత పక్షం రోజుల్లో 3.5 లక్షలకు పైగా అలాంటి నంబర్‌లు తొలగించారు.

50 సంస్థలను బ్లాక్‌లిస్ట్ చేశారు. అదనంగా, దాదాపు 3.5 లక్షల ఉపయోగించని/ ధ్రువీకరించని ఎస్ఎంఎస్ హెడర్‌లు, 12 లక్షల కంటెంట్ టెంప్లేట్‌లు బ్లాక్ అయ్యాయి.

అనుమానాస్పద కాల్‌లు, మెసేజ్‌లను తెలియజేయడానికి పౌరులకు వీలు కల్పిస్తూ, సైబర్ మోసానికి వ్యతిరేకంగా పోరాడేందుకు డాట్, సంచార్ సాథి (https://sancharsaathi.gov.in) అనే పౌర కేంద్రీకృత ప్లాట్‌ఫామ్‌లను ప్రారంభించింది.

ఇప్పటి వరకు సంచరసాథి సహాయంతో కోటికి పైగా మోసపూరిత మొబైల్ కనెక్షన్‌లను తొలగించారు. ఇంకా, సైబర్ క్రైమ్/ఆర్థిక మోసాలకు పాల్పడినందుకు 2.27 లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్‌లు బ్లాక్ చేశారు.

సమాంతరంగా, నెట్‌వర్క్ పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, నెట్‌వర్క్ లభ్యత, కాల్ డ్రాప్ రేట్లు, ప్యాకెట్ డ్రాప్ రేట్లు మొదలైన కీలక నెట్‌వర్క్ పారామితుల కోసం ప్రామాణికాలను క్రమంగా కఠినతరం చేస్తున్నారు.

దీనికి సంబంధించి, ట్రాయ్ తన సవరించిన నిబంధనలను , "ది స్టాండర్డ్స్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఆఫ్ యాక్సెస్ (వైర్‌లైన్స్, వైర్‌లెస్), బ్రాడ్‌బ్యాండ్ (వైర్‌లైన్, వైర్‌లెస్) సర్వీస్ రెగ్యులేషన్స్, 2024 (06 ఆఫ్ 2024)' విడుదల చేసింది.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అగ్రశ్రేణి సెమీకండక్టర్ సీఈఓల ప్రశంసలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం లోక్ కల్యాణ్ మార్గ్ 7లో సెమీకండక్టర్ రంగంలోని కార్య నిర్వహణాధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సెమికండక్టర్ల రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై వారితో ప్రధానమంత్రి విస్తృతంగా చర్చించారు. ప్రపంచ అభివృద్ధిపథాన్ని ఈ రంగం ఎలా ముందుకు తీసుకెళ్లగలదో శ్రీ మోదీ వివరించారు. భారత్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చేందుకు దేశంలో తీసుకుంటున్న సంస్కరణలను సైతం ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

సెమీకండక్టర్ రంగ అభివృద్ధి పట్ల భారతదేశ నిబద్ధతను సీఈఓలు ప్రశంసించారు. యావత్తు సెమీకండక్టర్ రంగంలోని ప్రముఖులు అందరినీ ఒక్క చోటకు చేర్చడం అపూర్వమైనదని పేర్కొన్నారు.

భారత్‌లో సెమీకండక్టర్ల అభివృద్ధి, దేశాన్ని స్వయం సమృద్ధం చేయాలన్న ప్రధాని మోదీ సంకల్పం తమను చాలా ఉత్సాహపరుస్తోందని మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్ర అన్నారు. భారత్‌లో సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి మోదీ తీసుకువచ్చిన విధానం ఆకర్షణీయంగా ఉందని చెప్పారు. "సెమికండక్టర్ అవకాశాలను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన భారతదేశ సెమీకండక్టర్ మిషన్‌కు ఇది సరైన సమయం. ఏఐ వృద్ధి చెందుతోంది. అవకాశాలూ పెరుగుతాయి. అయితే, జరగాల్సింది ఇంకా ఎంతో ఉంది'' అని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నాయకత్వానికి సరిపోలేది ఎక్కడా లేదని, ఆయన నాయకత్వం అపూర్వమైనదని సెమి సీఈఓ అజిత్ మనోచా ప్రశంసించారు. ఇది కేవలం భారత్‌నే కాకుండా మొత్తం ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. "ప్రపంచం మొత్తం ఆయనతోపాటు నడుస్తుందన్న నమ్మకం మోదీ నాయకత్వంలో కనిపిస్తోంది" అని పేర్కొన్నారు.

భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సంకల్పం, స్థిరత్వం, దూరదృష్టి ప్రధానమంత్రి మోదీకి ఉండటం తనకు ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ ఇస్తోందని ఎన్ఎక్స్‌పీ సీఈఓ కర్ట్ సీవెర్స్ పేర్కొన్నారు. సెమీకండక్టర్ పరిశ్రమలో ప్రధానమంత్రికి ఉన్నంత లోతైన జ్ఞానం కలిగిన మరే ప్రపంచ నాయకుడినీ తాను ఇప్పటివరకు చూడలేదని అన్నారు.

ప్రధానమంత్రి సంకల్పం, మన దేశ భవిష్యత్తు కోసం డిజిటల్ రంగపు మౌలిక సదుపాయాల పట్ల ఆయన ఆలోచన విధానం సెమీకండక్టర్ పరిశ్రమను ఉత్తేజపరుస్తోందని టీఈపీఎల్ సీఈఓ రణ్‌ధీర్ ఠాకూర్ తెలిపారు. వికసిత్ భారత్‌లో సెమీకండక్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

భారతదేశాన్ని ప్రపంచస్థాయికి చేర్చడానికి ప్రధానమంత్రి చేస్తున్న కృషి కేవలం భారత్‌కే కాకుండా ప్రపంచానికి అవసరమని జాకబ్స్ సీఈఓ బాబ్ ప్రగడ అన్నారు. "తయారీ రంగ పునరుజ్జీవంలో భారత్ ముందంజలో ఉండాలి. ఇది జరగబోతోంది. వచ్చే దశాబ్దంలోగా భారత్ ప్రపంచసాయిలో అగ్రగామిగా ఉంటుందని భావిస్తున్నాను" అని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి సందేశం ఎప్పుడూ సరళంగా, స్పష్టంగా ఉంటుందని, కాబట్టి ఆయన ఏం కోరుకుంటున్నారో తమకు తెలుసునని రెనెసాస్ సీఈఓ హిదెతోషి షిబాటా అన్నారు. "చురుకైన, వేగవంతమైన పురోగతికి సంపూర్ణమైన స్పష్టత సహాయపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి చూపిన నాయకత్వానికి తాను ముగ్ధుడిని అయ్యానని ఐఎంఈసీ సీఈఓ లుక్ వాన్ డెన్ హోవ్ పేర్కొన్నారు. సెమీకండక్టర్ సాంకేతికత రంగంలో భారత్‌ను కేంద్రంగా మార్చేందుకు ప్రధానమంత్రి నిబద్ధత, అంకితభావాన్నీ ఆయన ప్రశంసించారు. కేవలం తయారీనే కాకుండా పరిశోధన, అభివృద్ధి పట్ల ప్రధానమంత్రి దూరదృష్టి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశోధన, అభివృద్ధిలో భారత్ బలోపేతంగా మారేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం ఆయన వచ్చారు.

ప్రధానమంత్రి సంకల్పం, అమలు చేసే విధానం సాటిలేనిదని, ఇది నిజంగా అభినందించతగ్గదని టవర్ సీఈఓ రస్సెల్ సీ ఎల్‌వాంగర్ పేర్కొన్నారు.

గత కొన్నేళ్లుగా ప్రధానమంత్రి మోదీ నాయకత్వం ముచ్చట గొలుపుతున్నదని కాడెన్స్ సీఈఓ అనిరుధ్ దేవ్‌గన్ అన్నారు. అన్ని డిజిటల్ పరిశ్రమల్లో సెమీకండక్టర్ సాంకేతికత తప్పనిసరి అని పేర్కొన్నారు. గత మూడేళ్లతో పోలిస్తే మోదీ నాయకత్వం ఇప్పుడు వేగం పుంజుకుందని అన్నారు. ఆరంభం నుంచి ఇందులో భాగం కావడం తన అదృష్టమనీ, ఏటేటా భారీగా అభివృద్ధి కనిపిస్తోందనీ వ్యాఖ్యానించారు.

గత రెండు, మూడేళ్ల నుంచి ఈ రంగంలో డిజైన్ నుంచి తయారీ వరకు ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, ఎలా పెట్టుబడి పెట్టాలనే అనే కోణంలో స్పష్టత వచ్చిందని సినాప్సిస్ ప్రెసిడెంట్, సీఈఓ సాస్సైన్ ఘాజీ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కేంద్రం నుంచి స్థానిక, అంతర్జాతీయ వినియోగానికి అవసరమయ్యే ఉత్పత్తుల తయారీ దిశగా ఆసక్తి పెరగడం తాను ఇప్పుడు చూస్తున్నానని అన్నారు.

సెమికండక్టర్ పరిశ్రమ దిశగా భారత్ భారీ అడుగు వేసిందని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ గౌరవాచార్యుడు ప్రొఫెసర్ ఆరోగ్యస్వామి పాల్‌రాజ్ పేర్కొన్నారు. "చాలా శక్తి, చాలా పురోగతి కనిపిస్తోంది. ఇది నిజంగా గౌరవ ప్రధానమంత్రి సంకల్పం, ప్రేరణతోనే సాధ్యమైంది'' అని అన్నారు.

సెమీకండక్టర్ పరిశ్రమకు ఇది నిజంగా ఉత్తేజం నింపే సమయమని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని సీజీ పవర్ చైర్మన్ వెల్లయన్ సుబ్బయ్య పేర్కొన్నారు. భారత్ అపూర్వమైన స్థాయికి చేరుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ స్థాయిలో ప్రభుత్వం, పరిశ్రమ మధ్య సహకారం ముందెన్నడూ చూడలేదని ప్రశంసించారు.

సెమీకండక్టర్ మిషన్‌లో ప్రధానమంత్రి ఆశ్చర్యపరిచే సంకల్పాన్ని చూపారని యూసీఎస్‌డీ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రదీప్ ఖోస్లా పేర్కొన్నారు. దేశంలో సెమీకండక్టర్ల రంగానికి సరైన విధానాన్ని రూపొందించేందుకు ఇప్పటి వరకు చరిత్రలో ఏ పాలనాయంత్రాంగం కూడా ధైర్యం చేయలేదన్నారు. ప్రధానమంత్రికి సంకల్పం ఉండటం సంతోషకరమని, ఆయనలో నిబద్ధత ఉందని, కచ్చితంగా మనం విజయం సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# వ్యాపార వాతావరణంపై విశ్వాసం, పెట్టుబడులకు భారత్ అనువైన ప్రదేశం: పరిశ్రమ ఏకాభిప్రాయాన్ని తెలిపిన సీఈఓలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ఆయన నివాసం 7, లోక్ కల్యాణ్ మార్గ్‌లో సెమీకండక్టర్ ఎగ్జిక్యూటివ్స్ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ, సెమీకండక్టర్ ఎగ్జిక్యూటివ్ ల ఆలోచనలు వ్యాపారాన్నే కాకుండా భారత భవిష్యత్తును కూడా తీర్చిదిద్దుతాయని అన్నారు. రాబోయే కాలం సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తుందని, సెమీకండక్టర్లు డిజిటల్ యుగానికి పునాది అని అన్నారు. ఈ పరిశ్రమ ప్రాథమిక అవసరాలకు కూడా ఆధారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు.

ప్రజాస్వామ్యం, సాంకేతిక పరిజ్ఞానం కలిసి మానవాళి సంక్షేమాన్ని నిర్ధారిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్, తన ప్రపంచ బాధ్యతను గుర్తిస్తూ ఈ మార్గంలో ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు.

సామాజిక, డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సమ్మిళితాభివృద్ధికి ఊతమివ్వడం, తయారీ, ఆవిష్కరణలలో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అభివృద్ధి మూలస్తంభాల గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. వైవిధ్యమైన సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా మారే సామర్థ్యం దేశానికి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశ ప్రతిభాపాటవాలు గురించి ప్రధాని ప్రస్తావిస్తూ... సెమీకండక్టర్ పరిశ్రమకు సుశిక్షితులైన నైపుణ్య శక్తి అందుబాటులో ఉండేలా నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం అధిక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే ఉత్పత్తులను అభివృద్ధి చేయడంపై భారత్ దృష్టి సారించిందన్నారు. హైటెక్ మౌలిక సదుపాయాల పెట్టుబడులు పెట్టడానికి భారత్ గొప్ప మార్కెట్ అని అన్నారు. నేడు సెమీకండక్టర్ రంగ ప్రతినిధులు చూపుతున్న ఉత్సాహం ఈ రంగం కోసం ప్రభుత్వం మరింత కష్టపడేలా ప్రేరేపిస్తుందని ప్రధాని అన్నారు.

అంచనా వేయగల, స్థిరమైన విధాన నిర్ణయాలను భారత్ అనుసరిస్తుందని సంస్థల ప్రతినిధులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశం మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్‌లపై దృష్టి సారించినట్లు ప్రధాన మంత్రి తెలిపారు. పరిశ్రమకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

సెమీకండక్టర్ రంగ వృద్ధి పట్ల దేశానికి ఉన్న నిబద్ధతను సీఈఓలు ప్రశంసించారు. నేడు జరిగిన పరిణామాలు అపూర్వమైనవని..., ఇందులో సెమీకండక్టర్ రంగానికి చెందిన ప్రతినిధులందరిని ఒకే వేదిక మీదకు తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. సెమీకండక్టర్ పరిశ్రమ అపారమైన వృద్ధి, భవిష్యత్తు గురించి వారు మాట్లాడారు. సెమీకండక్టర్ పరిశ్రమ భారత్ కేంద్రంగా మారడం ప్రారంభించిందని..., ఈ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలిపిన పరిశ్రమలకు దేశంలో ఇప్పుడు అనువైన వాతావరణం ఉందని వారు పేర్కొన్నారు. భారతదేశానికి ఏది మంచిదో అది ప్రపంచానికి మంచిదని వారు తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు, సెమీకండక్టర్ రంగ ముడి పదార్థాలలో ప్రపంచ శక్తి కేంద్రంగా మారడానికి భారత్‌కు అద్భుతమైన సామర్థ్యం ఉందని అన్నారు.

దేశంలో ఉన్న అనుకూల వ్యాపార వాతావరణాన్ని వారు ఈ సందర్భంగా ప్రశంసించారు. సంక్లిష్ట భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో భారత్ సుస్థిరంగా ఉందని చెప్పారు. భారత్ సామర్థ్యంపై తమకు అపారమైన నమ్మకం ఉందని, పెట్టుబడులు పెట్టడానికి దేశం అనువైన ప్రదేశం అని, పరిశ్రమలో ఏకాభిప్రాయం ఉందని వారు ఉద్ఘాటించారు. గతంలో కూడా ప్రధాని ఇచ్చిన ప్రోత్సాహాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నేడు భారత్‌లో ఉన్న అపార అవకాశాలను గతంలో ఎన్నడూ చూడలేదని, భారత్‌తో భాగస్వామ్యం కావడం తమకు గర్వకారణమని అన్నారు.

ఈ సమావేశంలో ప్రపంచంలోని ప్రముఖ సెమీకండక్టర్ల సంస్థలైన సెమీ, మైక్రాన్, ఎన్ఎక్స్‌పి, పిఎస్ఎంసి, ఐఎంఇసి, రెనెసాస్, టిఈపిఎల్, టోక్యో ఎలక్ట్రాన్ లిమిటెడ్, టవర్, సినాప్సిస్, కాడెన్స్, రాపిడస్, జాకబ్స్, జెఎస్ఆర్, ఇన్ఫినియోన్, అడ్వాంటెస్ట్, టెరాడైన్, అప్లైడ్ మెటీరియల్స్, లామ్ రీసెర్చ్, మెర్క్, సీజీ పవర్, క్రైనెస్ టెక్నాలజీల సీఈవోలు, అధిపతులు, ప్రతినిధులు పాల్గొన్నారు. స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో, ఐఐటీ భువనేశ్వర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ఏచూరి మృతి పట్ల బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంతాపం

హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఏచూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా ఉద్యమాలకే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఏచూరి మరణం, దేశ రాజకీయాలకు, కార్మిక లోకానికి, లౌకిక వాదానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక ప్రపంచానికి గణేశుడు ప్రథమ పూజ్యుడు

**- సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి**

హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ కాలనీ యందు కాలనీలో ఎక్స్ ఫ్లోజన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపము వద్ద సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లిల్లీ మేరి మాట్లాడుతూ హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక ప్రపంచానికి గణేశుడు ప్రథమ పూజ్యుడని, సకల శాస్త్రాలకు అధిపతిగా, ఆటంకాలు తొలగించే విఘ్నేశ్వరుడిగా బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా, భక్తులు వినాయకుడిని పూజిస్తారని ఆమె పేర్కొన్నారు. వినాయకుడు ఈ లోకాన్ని రక్షించేందుకుగాను ఏకదంతుడు, లంబోదరుడు, మహోదరుడు, వక్రదంతుడు, ధూమ్రవరుణుడు గా, విఘ్న రాజుగా ఎన్నో అవతారాలు ఎత్తాడని ఆమె తెలిపారు. ప్రకృతి హితని కోరే వినాయక చవితి పండుగను పర్యావరణ హిత గణపతుల ప్రతిమలను ప్రతిష్టించి పండుగకు సార్ధకతను చేకూర్చాలని లిల్లీ మేరి పిలుపునిచ్చారు. విశ్వేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని లిల్లీ మేరి ఆకాంక్షించారు.

# స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలు విస్తరిస్తాం

**- చైర్మన్ కే శివసేనారెడ్డి**





హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో అన్ని రంగాల్లోనే మార్పు సాధిస్తున్నట్లుగానే క్రీడారంగంలో సమూలమైన మార్పులు సాధిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. ఈరోజు ఎల్బీ స్టేడియం లోని తన చాంబర్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాతక్రీడలకు చారిత్రాత్మకమైన బడ్జెట్ 364 కోట్లు కేటాయించడం జరిగిందని, గ్రామీణ క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు నూతన క్రీడా విధానానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. ప్రతి లోక్సభ నియోజకవర్గానికి ఒక స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు చేస్తూ వాటిని ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ సత్వర చర్యలు చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాదు నగరాన్ని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు,ఫోర్త్ సిటీ,ఫ్యూచర్ సిటిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం, గోల్ఫ్ క్లబ్ కు ఏర్పాట్లు తో పాట క్రీడలకు ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని శివసేన రెడ్డి తెలిపారు.నగరంలో ఉన్న అన్ని స్టేడియాల పునరుద్ధరణ కై చర్యలు చేపడుతున్నామని,జాతీయ అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేందుకు అన్ని స్టేడియాలను తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. హైదరాబాద్ కి షాన్ హమారా షెహర్ కి జాన్ లాగా పేరు పొందిన ఫుట్ బాల్ కు పునర్ వైభవం తీసుకొచ్చేందుకుఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్ 2024 ఘనంగా నిర్వహించడము జరిగిందని ప్రతి క్రీడాంశానికి తగిన ప్రాధాన్యహిస్తూ మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన తెలిపారు జాతీయ క్రీడా దినోత్సవం ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా నిర్వహించామని ఆగస్టు 27 28 29 తేదీలలో మూడు రోజులపాటు ఘనంగా వేడుకలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో కూడా ఘనంగా జాతీయ దినోత్సవాన్ని నిర్వహించి క్రీడాభిమానుల ప్రశంసలు అందుకున్నామని ఆయన వివరించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో క్రీడలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇచ్చే ప్రాధాన్యతను విస్పష్టంగా ప్రకటించడం జరిగిందని శాసనసభ చరిత్రలో క్రీడల పట్ల అంత సుదీర్ఘమైన చర్చ జరిగిన సందర్భాలు ఆయన అన్నారు. క్రీడారంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన భరోసాతో నూతన యావత్ తెలంగాణ క్రీడ సమాజంలో నూతన ఉత్సాహం నెలకొందని ఆయన అన్నారు ముఖ్యమంత్రి గారితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రివర్యులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సీతక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలకు హాజరై క్రీడాకారుల్లో నూతన ఉత్సాహం అందించారని వివిధ జిల్లాలలో యావత్ క్యాబినెట్ మంత్రులు గౌరవ శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు విరివిగా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా నేను బాధ్యతలు చేపట్టిన దాదాపు ఈ రెండు నెలల కాలంలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చామని ఆయన ప్రకటించారు రేవంత్ రెడ్డి గారిప్రభుత్వమిచ్చిన నైతిక మద్దతుతో వి వివిధ క్రీడా సంఘాల సహకారంతో స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలు విరివిగా చేపడుతూ క్రీడా సమాజానికి మరింత చేరువవుతామని ఆయన ప్రకటించారు.

# త్వరలో కాంగ్రెస్ పార్టీలోకి తాజ్మోహన్ రెడ్డి

**- పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గౌడ్ ను కలిసి అభినందనలు**

హైదరాబాద్ సెప్టెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇటీవల జవహర్నగర్ మునిసిపాలిటి కమిషనర్గా రిటైర్మెంట్ ఐన తెలంగాణా మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.తాజ్మోహన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీ లో చేరబోతున్నట్లు ప్రకటించారు.బుధవారం ఓల్డ్ ఎంఎల్ఏ క్వాటర్స్ లో తెలంగాణా పిసిసి అధ్యక్షుల నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి అభినందనలు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత రాష్ట్రం లో అనేక కొత్త మార్పులు వస్తున్నయని వాటిని ప్రజలు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పిసిసి అధ్యక్షుల నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వం లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై ముందుకు వెల్లగాలదన్న ఆశాబావాన్ని వ్యక్తం చేసారు.



# తమకు మరో 20 సీట్లు వచ్చిఉంటే ఈ కాషాయ నేతలంతా జైల్లో మగ్గేవారు

**-అనంత్‌నాగ్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే**

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 12(ఎక్స్ ప్రెస్ న్యూస్ 0;జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. అనంత్‌నాగ్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే బుధవారం ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఇవాళ దేశంలో మైనారిటీ ప్రభుత్వం కొలువుతీరిందని, అంతకుముందు బీజేపీ 400కుపైగా స్థానాలు గెలుచుకుంటామని ప్రగల్భాలు పలికిందని, మీ 400 సీట్లు ఎక్కడున్నాయని ఎద్దేవా చేశారు. 400పైగా సీట్లు సాధిస్తామని డప్పు కొట్టుకున్న కాషాయ పార్టీకి అతికష్టం మీద 240 స్థానాలే దక్కాయని వ్యాఖ్యానించారు. తమకు మరో 20 సీట్లు వచ్చిఉంటే ఈ కాషాయ నేతలంతా జైల్లో మగ్గేవారని, వారికి అదే సరైన ప్రదేశమని ఖర్గే పేర్కొన్నారు. మరోవైపు మణిపూర్ మళ్లీ భగ్గుమంటున్నా మోదీ సర్కార్ చోద్యం చూస్తోందని కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనటే అన్నారు. 16 నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతున్నాయని, గత 10 రోజుల్లో మణిపూర్‌లో జరిగిన హింసలో 12 మంది మరణించారని చెప్పారు. మణిపూర్‌లో మాజీ సీఎం ఇంటిపై రాకెట్లతో దాడి చేశారని, గవర్నర్ ఇంటిపై రాళ్లు రువ్వుతున్నారని, ఇంత జరుగుతున్నా దేశ ప్రధానికి మణిపూర్ వెళ్లే తీరిక లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ అమెరికా, బ్రిటన్, గ్రీస్, రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాలకు వెళుతున్నా మణిపూర్‌కు మాత్రం వెళ్లలేదని దుయ్యబట్టారు. ఓ రాష్ట్రంలో అలజడి రేగుతుంటే ప్రజాస్వామ్య దేశంలో ఏ ప్రధాని అయినా ఇలా చూస్తూ ఉంటారా అని ఆమె ప్రశ్నించారు.

# ఇస్మాయిల్ ఖాన్ పేట్, గుడ్ల మాచనూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటన.

**-డంపు యార్డు ల్లో బయో మైనింగ్ పనులు వేగవంతం చేయాలి.**

**-విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి.**

**-మోడల్ స్కూల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి.**



సంగారెడ్డి సెప్టెంబర్ 12(నేటి నిజం ప్రతినిధి)విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కంది ,హత్నూర మండలాలలో కలెక్టర్ క్రాంతి వల్లూరు,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లు కలిసి పర్యటించారు.

మొదటగా ఇస్మాయిల్ ఖాన్ పెట్ లో డంప్ యార్డు పై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో డంప్ యార్డు ను కలెక్టర్ పరిశీలించారు. డంపు యార్డులో చెత్త బయట వేయకుండా బయో మైనింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పురపాలక శాఖతో సృష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

రోజుకు 1500 మెట్రిక్ టన్నుల చెత్తను చేసేలా ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం డిసెంబర్ నెల వరకు బయో మైనింగ్ ప్లాంటు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అనంతరం ఇస్మాయిల్ ఖాన్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ,అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల ను కలెక్టర్ తనిఖీ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విద్యార్థులకు భవిష్యత్తు లో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇటీవల వచ్చిన డెంగ్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతి రోజు డ్రై డే కార్యక్రమంలో భాగంగా జ్వర సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. , అంగన్వాడి కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా బాలింతలు గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలో ఎలాంటి లోపం లేకుండా పోషకాహారం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల పిల్లలతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం హత్నూర మండలం గుండ్లమాచనూర్, మోడల్ స్కూల్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు దేవదాసు , పర్వీన్ షేక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తూర్పు గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు దుర్మరణం

ఏలూరు సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తూర్పు గోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దేవరపల్లి మండలం చిలకవారిపాకల సమీపంలో అదుపుతప్పి మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు.ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి జీడిపిక్కల లోడుతో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లకు మినీ వ్యాన్ మంగళవారం బయల్దేరింది. దేవరపల్లి మండలం చిలకావారిపాకలు సమీపంలో అదుపుతప్పి పంటబోదెలోకి వాహనం దూసుకెళ్లింది. దీంతో ఆ వ్యాన్ బోల్తాపడింది.మినీ వ్యాన్ బోల్తా పడటంతో జీడిపిక్కల కింద ఇరుక్కుని ఏడుగురు కూలీలు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. కాగా, ఈ ఘటనలో డ్రైవర్ తప్పించుకుని పరారయ్యాడు.

# హైదరాబాద్ పరిధిలోని 23 ప్రాంతాల్లో 262 ఆక్రమణల కూల్చివేత: హైడ్రా

హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ పరిధిలోని 23 ప్రాంతాల్లో ఆక్రమణలను కూల్చివేశామని హైడ్రా అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు 262 అక్రమ నిర్మాణాలు కూల్చివేశామని వెల్లడించారు. ఇప్పటివరకు 111.72 ఎకరాల భూమిని స్వాధీన చేసుకున్నామన్నారు. మాదాపూర్ సున్నం చెరువులో 42 అక్రమ నిర్మాణాలు, దుండిగల్ కత్వా చెరువలో 13, గగన్ పహాడ్ అప్ప చెరువులో 14, అమీన్ పూర్ పెదు చెరువు పరధిలో 24, రామ్ నగర్ లోని మణెమ్మ గల్లీలో మూడు అక్రమ నిర్మాణాలను కూలగొట్టారు. అమీన్ పూర్ చెరువులో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ తో పలువురు విల్లాలు కూలగొట్టిన విషయం తెలిసిందే. చెరువుల పరిధిలోని ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ల లో ఉన్న నిర్మాణాలను కూల్చడం ఖాయమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా రంగ ప్రవేశంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులపై ప్రజల్లో పెనుమార్పు వచ్చిందనీ, ఈ నేపథ్యంలోనే హైడ్రాను రీజినల్ రింగ్ రోడ్ వరకు విస్తరించి ఔటర్ వెలుపల ఉన్న చెరువులను కాపాడే దశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

# కౌశిక్ రెడ్డికి పాడే ఎక్కే సమయం వచ్చింది

**-మహిళలను చులకన చేసి మాట్లాడే ముందు ఒళ్ళు దగ్గర పెట్టునికి మాట్లాడాలి**

**-చీర గాజులు పంపలు అనుకుంటే మొదట కేసీఆర్ కి పంపాలి**

**-కౌశిక్ రెడ్డి పై ధ్వజమెత్తిన మహిళా కాంగ్రెస్ నేతలు**





హైదరాబాద్ సెప్టెంబర్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహిళలను చులకన చేసి మాట్లాడే ముందు ఒళ్ళు దగ్గర పెట్టునికి మాట్లాడాలని పలువు మహిళా కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.బుధవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో బండ్రు శోభారాణి, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మహిళ కార్పొరేషన్ చైర్మన్, కల్వ సుజాత ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, అధికార ప్రతినిధులు భవాని రెడ్డి, బొజ్జ సంధ్యారెడ్డి, తదితరులు మాట్లాడారు. తెలంగాణ మహిళలకు పోరాట స్ఫూర్తి ఉందన్నారు. మహిళలను అడ్డు పెట్టుకొని పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు.పాడి కౌశిక్ రెడ్డి చీర గాజులు పంపలు అనుకుంటే మొదట కేసిఆర్ కి పంపాలి.ఇతర పార్టీ నాయకుల చేరికతో టీఆర్ఎస్ పుట్టింది.కేసిఆర్ రాజకీయ పుట్టుక ఎక్కడ ఉందో చూసుకో.. అని గుర్తు చేసారు.పాడి కౌశిక్ రెడ్డి మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఆయన మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.మహిళ కమిషన్ పాడి కౌశిక్ రెడ్డి వాఖ్యలు సుమోటోగా తీసుకొని విచారణ కి పిలవాలి. ఆయన్ను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని స్పీకర్ ను కోరుతామ న్నారు.ప్రభుత్వాన్ని పడగోడతాం అంటే నిలబెడుతాం అని ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. కౌశిక్ రెడ్డి కి పాడే ఎక్కే సమయం వచ్చింది.తెలంగాణ ఉద్యమకారుల మీద రాళ్ళు రువ్విన చరిత్ర నిది.బిడ్డ,భార్య ను అడ్డుపెట్టు కొని చని పోతాం అని ప్రచారం చేసి గెలుపొందావు.పాడి కౌశిక్ రెడ్డి పతివ్రత శిరోమణి లీడర్ అన్నట్లు మాట్లాడుతున్నాడు.మహిళలను అగౌరవ పరిస్తే చెప్పుదెబ్బలు పాలు అవు తారు అంటూ పాడి కౌశిక్ రెడ్డి కి మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి చెప్పు చూపించారు. వెంటనే మహిళలకు క్షమాపణలు చెప్పకపోతే బయట తిరగనివ్వనని హెచ్చరించారు.

